క్లుప్తంగా

ప్రభుత్వ అతిథి గృహాన్ని వినియోగంలోకి తెస్తాం



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని ప్రభుత్వ అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకు వస్తామని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. గ్రామంలోని పంచాయతీరాజ్ వసతిగృహాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లగా ప్రభుత్వ అతిథి గృహం నిరుపయోగంగా ఉంటోందన్నారు. ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా ఉండటంతో విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. గతంలో రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించామని త్వరలోనే వినియోగంలోకి తీసుకు రావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్య.. పచ్చి అవకాశవాది: పెంటి

జగ్గయ్యపేట అర్బన్: బీసీ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకొని బీసీలను అణగదొక్కే విధంగా చర్యలు తీసుకుంటూ వైఎస్సార్ సీపీని మోసం చేసిన పచ్చి అవకాశవాది ఆర్.కృష్ణయ్య అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ ఉద్యమానికి నాయకత్వం వహించి బీసీల అభ్యున్నతికి పాటుపడతాడని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతి మంచితనంతో పక్క రాష్ట్రానికి చెందిన ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపాడని గుర్తు చేశారు. ఇంకా రెండేళ్ల వరకు సభ్యత్వం ఉన్నా బీజేపీ మోజులో పార్టీకి వెన్నుపోటు పొడిచి బీసీ ఉద్యమాన్ని తన స్వార్థం కోసం వాడుకున్న పక్కా అవకాశవాదానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచాడని విమర్శించారు. బీజేపీ రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన తొలి రోజే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును తేవాలని యావత్ బీసీలు కోరుకుంటున్నారని తెలిపారు. అలా చేసి కృష్ణయ్య తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి కృషి



నందిగామ టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తొమ్మిది అర్జీలు అందాయన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించి ఒకటి, రెవెన్యూ ఆరు, వ్యవసాయ శాఖ ఒకటి, పంచాయతీరాజ్‌కు సంబంధించి ఒక అర్జీ అందినట్లు తెలిపారు. అర్జీలను వివిధ శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి రెండు రోజుల శిక్షణ

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10, 11 తేదీల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎల్ఎస్‌డీజీ)పై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

మున్సిపల్ డీఈఈపై ఫిర్యాదు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ) షేక్ కలీముల్లా విధుల్లో అలసత్వం చూపిస్తున్నారని, విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఐదో వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ మున్సిపల్ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్ ద్వారా డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ), తాడేపల్లి వారికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావుకు ఫిర్యాదు చేశాడు. కొన్ని రోజుల నుంచి డీఈఈ డ్యూటీకి సక్రమంగా రావడం లేదని, దీంతో ప్రజాప్రతినిధులు, పనుల నిమిత్తం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సోమవారం ఎన్నిగంటలకు డ్యూటీకి వచ్చింది మున్సిపల్ కార్యాలయం ద్వారం వద్ద ఉన్న సీసీ కెమెరా రికార్డింగ్‌ను గానీ, ఉద్యోగుల హాజరు పట్టీని గాని పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అధికార పార్టీ పెత్తనం
- క్వారీవైపు కన్నెత్తిచూడని అధికారులు
- పట్టపగలే యంత్రాలతో లోడింగ్
- రాత్రి వేళల్లో తెలంగాణకు ఇసుక



ఆళ్లూరుపాడు క్వారీ లోపల లోడింగ్‌తో ఉన్న లారీలు



లోడింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్న పొక్లయిన్, జేసీబీ

ఆళ్లూరుపాడు(వత్సవాయి): ఇసుకపై అధికార 'కూటమి' నేతల పెత్తనం అధికంగా కనిపిస్తోంది. ఎన్నికల ముందు 'కూటమి' అనేక హామీలు ఇచ్చింది. వాటిలో ఒకటి ఉచిత ఇసుక. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందరికీ ఉచితంగా ఇసుక అందిస్తామని చెప్పి తీరా కుర్చీ ఎక్కిన తర్వాత హామీలన్నీ ఉచితంగా గాల్లో కలిసిపోయాయి. ఉచితం మాటున ఇసుకపై కూటమి నాయకులు అధికార పెత్తనం చేస్తున్నారు. కేవలం వారి కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం క్వారీల వైపు కన్నెత్తి చూడటం లేదు.

ఆళ్లూరుపాడు నుంచి..

మండలంలోని ఆళ్లూరుపాడు ఇసుక క్వారీ నుంచి ప్రజలు ఇసుకను ఉచితంగా తరలించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇక్కడ నుంచి పేద ప్రజలు ఇసుకను తరలించుకోవాలంటే తలనొప్పిగా మారింది. దీనికి కారణం క్వారీపై అధికార పార్టీ నాయకులు పెత్తనం చేయడమే. పేదలు తమ గృహ అవసరాల కోసం ఇసుకను తరలించుకునేందుకు ట్రాక్టర్లతో క్వారీల వద్దకు వెళ్తే అక్కడ ఉన్న నాసిరకం ఇసుకనే ట్రాక్టర్లలో నింపుకోవాలని అక్కడ ఉంటున్న వారు హుకుం జారీ చేస్తున్నారు. ఈ ఇసుక గృహావసరాలకు పనికిరాదు లోపలికి వెళ్లి ట్రాక్టర్‌కు నింపుకుంటామని అడిగితే మీరు క్వారీ లోపలికి వెళ్లడానికి వీల్లేదు.. ఇష్టం ఉంటే ఇక్కడ ఇసుక నింపుకోండి లేకుంటే లేదని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించినా వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో చేసేదిలేక ఎవరికీ చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు.

తెలంగాణకు..

క్వారీ నుంచి ఇసుక యథేచ్ఛగా తెలంగాణకు తరలిపోతోంది. పట్టపగలే పొక్లయిన్, జేసీబీలతో క్వారీల్లో లారీలు, టిప్పర్లలో నింపుకుని రాత్రి వేళల్లో తెలంగాణకు సరఫరా చేస్తున్నారు. ఆళ్లూరుపాడు క్వారీ నుంచి తెలంగాణ సరిహద్దు కేవలం పది కిలోమీటర్లలోపే ఉంది. దీంతో వారికి అడ్డూ అదుపులేకుండా పోయింది. యంత్రాలతో లోడింగ్ చేసుకునేందుకు అనుమతులు లేకున్నా ఇసుకాసురులను అడిగే ధైర్యం ఎవరూ చేయలేకున్నారు. దీంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటలా సాగుతోంది.

చర్యలు తీసుకుంటాం

క్వారీ లోపల నుంచి ఎటువంటి యంత్రాలను ఉపయోగించి ఇసుకను లోడింగ్ చేయడానికి అనుమతులు లేవు. ఈ అంశం ఇప్పటివరకు మా దృష్టికి రాలేదు. వెంటనే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

–ఎస్.నరసింహారావు, తహసీల్దార్, వత్సవాయి

పాడి పరిశ్రమపై యువ రైతులు ఆసక్తి చూపాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): పాడి పరిశ్రమపై యువ రైతులు ఆసక్తి చూపాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. గ్రామంలోని పాల శీతలీకరణ కేంద్రం కల్యాణ మండపంలో పాల ఉత్పత్తిదారుల సమావేశ భవనంలో 11 పాల సహకార సంఘాలకు రూ. 87.82 లక్షల బోనస్ చెక్కులను సోమవారం సంఘ అధ్యక్షులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోందన్నారు. రైతుల కష్టానికి తగిన ఫలితం అందించడానికి బోనస్, పాల ధరను పెంచామని తెలిపారు. పశు ఆరోగ్యం నిమిత్తం వైద్య శిబిరాలు, ఇన్సూరెన్స్, పాడి రైతులకు ఏసీటీ, కల్యాణమస్తు, క్షీరబంధు, తదితర పథకాలతో పాటు నాణ్యమైన పశుదాణాను కూడా అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువ రైతులు కూడా పాడి పరిశ్రమపై అవగాహనతో ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నెలకుదిటి నాగేశ్వరరావు, చెరుకూరి లవయ్య, ట్రస్ట్ సభ్యులు కోకా వెంకటేశ్వరరావు, పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ నరేష్, పాల సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు



పేట హైవే బస్టాండ్‌లో శిలాఫలాకం వద్ద తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: హైవే బస్టాండ్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణ సమీపంలోని హైవే పక్కన నిర్మించిన ఆర్టీసీ హైవే బస్టాండ్‌ను సోమవారం ఆ పార్టీ నాయకులతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1.20 కోట్లతో 65వ జాతీయ రహదారి పక్కన ఆర్టీసీ హైవే బస్టాండ్ నిర్మాణం చేసి ప్రారంభోత్సవం కూడా చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కావస్తున్నా హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. ఈ ప్రాంగణం అధ్వానంగా మారిందని, ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇక్కడ వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ ముందు తారు రోడ్డు, లైటింగ్, టాయిలెట్ల వాటర్ పైపులైన్ నిర్మాణ పనులు వెంటనే చేయించాలని కోరారు. జనవరి 1వ తేదీ లోపు హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పార్టీ సీనియర్ నాయకులు పెంటి శ్రీనివాసరావు, మండవ శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఎస్టీ సెల్, ఎస్సీ సెల్ నాయకులు బద్దూనాయక్, కన్నమాల శామ్యూల్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు మన్నె అప్పారావు, పింగళి నరసింహారెడ్డి, బీసీ నాయకులు జవ్వాజి నరసింహారావు, చాపల వెంకటేశ్వర్లు, నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, బీఎస్ఎన్ఎల్ రామారావు, ఉపేందర్‌రెడ్డి, బైరిబోయిన బాబు, మోరె నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటల ద్వారా 'తిరుమలగిరి'కి రూ. 4.91 లక్షల ఆదాయం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామికి వివిధ రకాల వేలం పాటల ద్వారా రూ. 4.91 లక్షల ఆదాయం వచ్చిందని దేవస్థాన ఏసీ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో పలు రకాల వేలం పాటలు నిర్వహించారు. వీటిలో భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు రూ. 3.30లక్షలు, ఫొటోలు తీసుకునే హక్కుకు రూ. 70 వేలు, కొండ కింద టెంటు సామగ్రి అద్దె లైసెన్స్‌కు రూ. 91 వేల ఆదాయం వచ్చిందన్నారు. కొన్ని వేలం పాటలకు డిపాజిట్‌లు రానందున వాయిదా వేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వసతులను వినియోగించుకోవాలి



స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్, పక్కన శ్రీనివాసరావు, సుధానంద్ తదితరులు

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం, దాతలు కల్పిస్తున్న వసతులను విద్యార్థులు వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు భౌతిక–రసాయన శాస్త్ర పేపర్లకు సంబంధించి చిల్లకల్లు హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జిల్లేపల్లి సుధానంద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో పాటు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం 2024లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ద్రౌపదిముర్ము నుంచి అందుకోవడంతో పాటు ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడిన గుడివాడకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావు తయారు చేసిన సైన్స్ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. సుధానంద్, మాజీ సర్పంచ్ సుధీర్‌బాబు ద్వారా ఈ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జలజ, ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్, నాయకులు నూతలపాటి కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపు కమ్యూనిటీ హాల్‌కు స్థలం మంజూరు చేయండి

ఎమ్మెల్యే తాతయ్యకు రంగా సేవాసమితి సభ్యుల వినతి



ఎమ్మెల్యే తాతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు సత్యశ్రీను, మనోహర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో లయన్స్ క్లబ్ కమ్యూనిటీ భవనం పక్కన ఉన్న మున్సిపల్ స్థలంలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని వంగవీటి మోహనరంగా సేవా సమితి సభ్యులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో కలిసిన రంగా సేవాసమితి సభ్యులు పసుపులేటి సత్యశ్రీనివాస్, వట్టెం మనోహర్, ఈమని కిషోర్ తదితరులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాపు కమ్యూనిటీ చిరకాల వాంఛ అయిన కమ్యూనిటీ భవనం నిర్మాణం జరిగితే ఇతర కులస్తులకు కూడా ఉపయోగపడేలా దీన్ని తీర్చి దిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో వంగవీటి మోహనరంగా సేవాసమితి సభ్యులు చిలుకూరి హరి, గోవింద, మణికంఠ, యర్రంశెట్టి ఆంజనేయులు, గోపి, చిలుకూరి శివ తదితరులు పాల్గొన్నారు.

దారంతా చింతే



కంకర తేలి ప్రమాదకరంగా అనిగండ్లపాడు–గుమ్మడిదుర్రు దారి

మండలంలోని పలు గ్రామీణ రోడ్లు నరకప్రాయంగా మారాయి. సెప్టెంబర్‌లో వచ్చిన వరదలకు రోడ్లు దారుణంగా కనిపిస్తున్నాయి. తారు మొత్తం కొట్టుకు పోయి కంకర తేలడం, పలుచోట్ల రోడ్లు మొత్తం కోతకు గురయ్యాయి. పెనుగంచిప్రోలు, వేమవరం, ముచ్చింతాల, తాళ్లూరు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు దారులతో వాహనచోదకులకు చింతే మిగులుతోంది. దీంతో తాత్కాలికంగా కంకర, మట్టి పోసి రవాణా సాగిస్తున్నారు. ఈ రోడ్లు గుంతలమయంగా మారడంతో పాటు కంకర పైకి తేలడంతో వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. తక్షణం మట్టి, కంకరతో సరిచేసిన రహదారులను తారురోడ్లుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

–పెనుగంచిప్రోలు



దెబ్బతిన్న అనిగండ్లపాడు–శివాపురం రోడ్డు



గుంతలమయంగా పెనుగంచిప్రోలు–వేమవరం రహదారి



దారుణంగా దెబ్బతిన్న ముచ్చింతాల–తాళ్లూరు రోడ్డు

రెవెన్యూ సదస్సులతో ఇబ్బందులు తొలగించుకోండి



పెద్దవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

నందిగామ టౌన్: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకుని భూముల సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సురేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని పెద్దవరం గ్రామ సచివాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూముల రికార్డుల్లో మార్పులు, చేర్పులు, సర్వే వివాదాలు, తదితరాలకు సంబంధించిన సమస్యలను సదస్సు దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. రైతుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదేవి, నాయకులు ఇంటూరి సీతయ్య, నేతలు, రైతులు పాల్గొన్నారు.

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ రైతులు భూ సమస్యలు, హద్దుల వివాదాలు, పాస్ పుస్తకాలు, అడంగళ్ తప్పొప్పులపై అర్జీ అందించాలన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు ఏడు దరఖాస్తులు అందించారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ మంగమ్మ, సర్వేయర్ అనూష్‌బాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలోని గోకరాజుపల్లి గ్రామంలో సోమవారం తహసీల్దార్ హుస్సేన్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు 10 అర్జీలు దాఖలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీదేవి, సర్పంచ్ మల్లెల వాసు, పలువురు నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఆరు నెలల గడువు

నందిగామ టౌన్: అనధికార ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని అనధికార ప్లాట్‌లు, లేఅవుట్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఆరు నెలల గడువు ఇచ్చిందని తెలిపారు. నిబంధనలు ఎవరూ ఉల్లంఘించకూడదని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రూ.36 లక్షలు చోరీ



విచారణ చేస్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు

దబ్బాకుపల్లి(వత్సవాయి) : ఇంట్లో ఉంచిన రూ.36 లక్షలు చోరీ అయిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన షేక్ మౌలా వత్సవాయిలో ఆటో మెకానిక్. అతనికి సొంత షెడ్డు ఉంది. 25 ఏళ్లగా మెకానిక్ వృత్తితో పాటు ఆటోలు కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటాడు. మౌలాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె ఖమ్మంలో చదువుతుండగా మరో కుమార్తె, కుమారుడు వత్సవాయిలోనే చదువుకుంటున్నారు. మధ్యాహ్నం సమయంలో మౌలా భార్య రజియా చిన్న కుమార్తెతో కలిసి ఇంటికి తాళం వేసి వత్సవాయిలో ఉన్న షెడ్ వద్దకు వెళ్లి భర్తకు తాళం ఇచ్చి జగ్గయ్యపేట వెళ్లారు. మౌలా షెడ్డులో పని ముగించుకుని ఇంటికి వెళ్లేసరికి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా బీరువాలో పెట్టిన రూ.36 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి మౌలాను విచారణచేయగా తనకు నగదు బ్యాంకులో వేసుకునే అలవాటు లేదని జనవరిలో కుమార్తెల వివాహం కోసం నగదు దాచిపెట్టుకున్నట్లు తెలిపారు. ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు


నందిగామ ఏసీపీ తిలక్



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నందిగామ ఏసీపీ తిలక్ తెలిపారు. గ్రామంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. తొలుత ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నందిగామ నుంచి గరికపాడు వరకు 65వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటి నివారణకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని వివరించారు. రహదారి పక్కన గ్రామాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతం తెలంగాణ సరిహద్దుగా ఉండటంతో అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ ధరించడంపై, రోడ్డు భద్రతా నియమాలపై ఆటో డ్రైవర్‌లకు అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కక్షిదారులు చట్టప్రకారం నడుచుకోవాలి



న్యాయవాదుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న న్యాయమూర్తి

నందిగామ టౌన్: బాధిత కక్షిదారులు చట్టానికి లోబడి నడుచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం పేర్కొన్నారు. స్థానిక సబ్‌కోర్టులో సోమవారం న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదులు బాధితులకు అండగా ఉండి సత్వర న్యాయం అందించడానికి కృషి చేయాలన్నారు. ఇరువర్గాలకు అనుసంధాన కర్తగా ఉండి బాధితుల సమస్య పరిష్కరించాలని సూచించారు. అనంతరం కక్షిదారుల సమస్యలను ఎలా పరిష్కరించాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, న్యాయవాదులు మౌలేశ్వరరావు, కరీముల్లా, నారాయణరావు, మట్టా ప్రసాద్, బొందలపాటి రామకృష్ణ, తారాసింగ్, రామారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.